రోడ్ల పై ధాన్యం ఆరబోత
ఇబ్బందుల్లో వాహనాదారులు

రోడ్డు కనిపించకుండా ఆరబోసిన ధాన్యం

మాచారెడ్డి, ఏప్రిల్ 5 : మండలంలోని మైసమ్మ చెరువు నుంచి ఎల్లంపేట వైపు వెళ్లేదారిలో రోడ్డుపై పూర్తిగా ధాన్యం ఆరబెట్టడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అసలే సింగిల్ రోడ్డు.. దాని పక్కకు పొదలు, గుంతల్లో నుంచి రాకపోకలు సాగించాల్సి వస్తున్నదని వాహనదారులు తెలిపారు. రోడ్డుపై ధాన్యం ఆరబెట్టడంతో వాహనదారులకు ప్రమాదం పొంచి ఉన్నది. అసలే ఇరుకు రహదారులు. ధాన్యంపై వాహనాలు వెళ్తే ప్రమాదాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రైతులకు అవగాహన కల్పించాలి

రోడ్డుపై ధాన్యం ఆరబెట్టకుండా అధికారులు రైతులకు అవగాహన కల్పించాలి. ఖాళీ ప్రదేశాల్లో కానీ.. జనసంచారం లేని స్థలాల్లో ధాన్యం ఆరబెట్టాలని రైతులకు అవగాహన కల్పించాలి. రోడ్డుపై ధాన్యం ఆరబెడితే జరిగే ప్రమాదాలను రైతులకు వివరించాలి.

రైతులకు అవగాహన కల్పిస్తాం

రోడ్డుపై ధాన్యం ఆరబెట్టడం ద్వారా వాహన దారులకు ఇబ్బందులు ఎదురవుతాయి. ద్విచక్ర వాహనాలకు ప్రమాదం జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. వరి కోతలు ప్రారంభమైన సంద ర్భంగా గ్రామాల్లో రైతులకు రోడ్డు పై ధాన్యం అరబెట్టనివ్వ కుండా అవగాహన కల్పించి చర్యలు తీసుకుంటాం.

- ఎస్సై అనిల్, మాచారెడ్డి

పాఠశాల అభివృద్ధికి ఆర్థిక సహాయం అందజేత

విరాళం అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

కామారెడ్డి, ఏప్రిల్ 5 : జిల్లా కేంద్రంలోని పీవీపీ ఓరియంటల్ పాఠశాలను 1998-1999 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు శనివారం సందర్శించారు. పాఠశాల అభివృద్ధికి తమ వంతుగా రూ.70,127 ప్రధానోపాధ్యాయుడు మురళీరెడ్డికి అందజేశారు. అనంతరం ఆయనను శాలువాతో సత్కరించారు. పాఠశాల అభివృద్ధికి భవిష్యత్తులో కూడా మరింత సహాయం చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

జగ్జీవన్ రామ్ ఆశయ సాధనకు కృషి చేయాలి

కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

నమస్తే తెలంగాణ యంత్రాంగం, ఏప్రిల్ 5 : బాబు జగ్జీవన్ రామ్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అన్నారు. జగ్జీవన్ రామ్ జయంతిని పురస్కరించుకొని కామారెడ్డి మున్సిపల్ కార్యాలయ ఆవరణలో శనివారం వేడుకలను నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి కలెక్టర్ పూల మాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి, అదనపు కలెక్టర్ చందర్, జిల్లా ఎస్సీ సంక్షేమ అధికారిణి రజిత, ఆర్డీవో వీణ, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దయానంద్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేందర్, వివిధ కుల సంఘాలు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు. మాచారెడ్డి మండలంలోని అక్కాపూర్ గ్రామంలో బాబు జగ్జీవన్ రామ్ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నస్రుల్లాబాద్, బీర్కూర్, బీబీపేట, దోమకొండ మండల కేంద్రాలతోపాటు గ్రామాల్లో బాబు జగ్జీవన్‌రామ్ జయంతిని నిర్వహించారు. ఎల్లారెడ్డి పట్టణంలోని 11వ వార్డులోని బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి మున్సిపల్ కమిషనర్ మహేశ్ కుమార్ పూలమాల వేసిన నివాళులర్పించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో జగ్జీవన్‌రాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు. బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ఆదిమూలం సతీశ్‌కుమార్, నాయకులు శ్రావణ్‌కుమార్, ఎరుకల సాయిలు, బబ్లూ తదితరులు పాల్గొన్నారు. అన్నాసాగర్‌లో బాబూ జగ్జీవన్‌రామ్ జయంతిని నిర్వహించారు. జీపీ ఆవరణలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాన్సువాడ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ సమీపంలో బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాసరెడ్డి, బీఆర్ఎస్ పార్టీ నాయకుడు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ షేక్ జుబేర్, ఆయా పార్టీల నాయకులు పూల మాలలు వేసి నివాళి లర్పించారు. బాన్సువాడ సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ కిరణ్మయి సిబ్బందితో కలిసి, మండలంలోని బోర్లం గ్రామంలో అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు బాబు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను బీఆర్ఎస్ పార్టీ నాయకు డు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ షేక్ జుబేర్ కొనియాడారు. మున్సిపల్ మాజీ చైర్మన్ గంగాధర్, కృష్ణారెడ్డి, ఖాలేక్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు సాయిబాబా, గణేశ్, శివసూరి, నర్సింహులు గౌడ్, మహేశ్, లక్ష్మణ్, మౌలా, మోచి గణేశ్, రమేశ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు. పిట్లంలోని ఏఎంసీ కార్యాలయ ఆవర ణలో బాబూ జగ్జీవన్ రామ్ చిత్రపటాని కి ఎమ్మెల్యే లక్ష్మీకాంతా రావు పూలమాలవేసి నివాళులర్పించారు. పెద్దకొడప్‌గల్ ఎంపీడీ వో కార్యాలయ ఆవరణలో బాబు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి ఎంపీడీవో లక్ష్మీకాంత్‌రెడ్డి, స్థానిక నాయకులు పూలమాలవేసి నివాళులర్పించారు. మహ్మద్‌నగర్ మండలం కోమలంచ స్థానిక నాయకులు, నాగిరెడ్డిపేట మండల పరిషత్ కార్యాలయంలో బాబూ జగ్జీవన్‌రామ్ చిత్ర పటానికి పూల మాల వేసి ఎంపీడీవో ప్రభాకర్, సిబ్బంది నివాళులర్పించారు.

కామారెడ్డిలో జగ్జీవన్ రామ్ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

బాన్సువాడలో నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకుడు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ షేక్ జుబేర్

ఎల్లారెడ్డిలో నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

బాన్సువాడలో నివాళులర్పిస్తున్న పోచారం..

పిట్లంలో ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు..

మూడు నెలలుగా అంధకారం!

- భయాందోళనలో 11వ వార్డు ప్రజలు
- చోద్యం చూస్తున్న అధికారులు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కాలనీవాసులు

బీబీపేట్, ఏప్రిల్ 5 : మండల కేంద్రంలోని మహాత్మాజ్యోతిబా పూలే గురుకుల పాఠశాల సమీపంలోని 11వ వార్డులో మూడు నెలలుగా అంధకారం నెలకొన్నది. విద్యుత్ స్తంభాలకు లైట్లును ఏర్పాటు చేయడం లేదని కాలనీవాసులు వాపోతున్నారు. రాత్రి వేళ భయాందోళనకు గురువుతున్నామని తెలిపారు. అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. గ్రామ పంచాయతీ అధికారులను అడిగితే విద్యుత్ అధికారులు కరెంటు సరఫరా చేయలేదని చెబుతున్నారని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. విద్యుత్ అధికారులను సంప్రదిస్తే గ్రామ పంచాయతీ అధికారులకు సమస్యను తెలుపమని అంటున్నారని కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే మూడు నెలలు గడిచిపోయాయని ఇంకా ఎన్ని నెలలు వేచి ఉండాలని కాలనీవాసులు మండిపడుతున్నారు. ఈ విషయంపై ఎంపీడీవో పూర్ణ చంద్రోదయకుమార్‌ను ఫోన్‌లో వివరణ కోరగా సమస్యను పరిష్కరిస్తామన్నారు. విద్యుత్ ఏఈ భాస్కర్‌ను సంప్రదించగా.. 11వ వార్డులో దాదాపు ఎనిమిది స్తంభాలకు కరెంట్ సరఫరా అవుతున్నదని, విద్యుత్ లైట్లు సంబంధిత అధికారులు ఏర్పాటు చేయాలని, విద్యుత్ శాఖ నుంచి కరెంటు మాత్రమే సరఫరా చేస్తామని, విద్యుత్ స్తంభాలు లేకుంటే కాలనీ వాసులు దర ఖాస్తు చేసుకోవాలని, ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు సమస్యను పరిష్కరించాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

అధికారులు స్పందించాలి

11 వార్డులో రెండు కరెంటు స్తంభాలు ఉన్నాయి. వీటికి లైట్లు ఏర్పాటు చేయాలని కాలనీవాసులందరూ కలిసి గ్రామ పంచాయతీ, విద్యుత్ శాఖ అధికారులను సంప్రదించినా ఫలితంలేకపోయింది. లైట్లు లేకపోవడంతో రాత్రుల్లో చాలా ఇబ్బందులు పడుతున్నాం. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలి.

- సూతరి శ్రీకాంత్, బీబీపేట 11వ వార్డు కాలనీ వాసి

కాలనీలో వెలగని లైట్లు

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు

పెద్ద కొడప్‌గల్ (పిట్లం), ఏప్రిల్ 5: పిట్లంలో తాగు నీటి సమస్య తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని గ్రామ కార్యదర్శి బల్‌రాం శనివారం తెలిపారు. మండల కేంద్రంలో లైబ్రరీ, గ్రామ పంచాయతీ వద్ద రెండు 5 హెచ్‌పీ మోటర్లలో భూగర్భ జలాలు తగ్గడంతో అదనంగా కొత్త పైపులు బిగించామన్నారు. తాగునీటి సమస్య ఉన్న కుంట కట్ట కాలనీలో పంచాయతీ వాటర్ ట్యాంకర్ ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నామన్నారు.

బైక్ పైనుంచి పడి వ్యక్తి మృతి

నస్రుల్లాబాద్, ఏప్రిల్ 5 : నస్రుల్లాబాద్ మండలం మైలారం గ్రామ శివారులోని డబుల్ బెడ్ రూం ఇండ్ల వద్ద శనివారం బైక్ అదుపుతప్పి బీర్కూర్ మండలం సంబాపూర్ గ్రామానికి చెందిన గైక్వాడ్ సంతోష్(36) మృతి చెందినట్లు ఎస్సై లావణ్య తెలిపారు. మేస్త్రీ పనికి వెళ్లి వస్తానని బయల్దేరి బీర్కూర్ గ్రామానికి చెందిన తమ బంధువు అయిన సభాష్‌తో కలిసి నస్రుల్లాబాద్ వైపునకు వెళ్తుండగా మైలారం గ్రామం వద్ద బైక్ పైనుంచి పడి మృతి చెందాడు. భార్య సురేఖ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

పోస్టాఫీస్‌లో ఆధార్‌కేంద్రం ప్రారంభం

మద్నూర్ పోస్టాఫీసులో ప్రారంభమైన ఆధార్‌కేంద్రం

మద్నూర్, ఏప్రిల్ 5: మండలకేంద్రంలోని పోస్టాఫీస్‌లో ఆధార్‌సేవలు అందుబాటులోకి వచ్చాయి. మండలకేంద్రానికి చెందిన సమాజసేవకుడు అజయ్ తమ్మేవార్ వారం రోజుల క్రితం ఢిల్లీకి వెళ్లి సంబంధిత మంత్రిని కలిసి మండలకేంద్రంలో ఆధార్‌సెంటర్, బిచ్కుంద, జుక్కల్ మండలాల్లో నూతన పోస్టాఫీస్ భవనాలు మంజూరు చేయాల్సిందిగా వినతిపత్రం అందజేశారు. శనివారం ఆధార్‌కేంద్రం ప్రారంభమైందని, త్వరలో రెండు మండలాల్లో నూతన భవనాలు మంజూరవుతాయని ఆయన విలేకరులకు తెలిపారు. ఆధార్ సేవలు అందుబాటులోకి రావడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

బండపల్లి గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు

పెద్ద కొడప్‌గల్ (పిట్లం), ఏప్రిల్ 5 : పిట్లం మండలంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చిల్లెర్గి పరిధిలోని బండపల్లి గ్రామంలో జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు శనివారం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, రైతులు దళారులకు అమ్మి మోసపోవద్దని సూచించారు. కార్యక్రమంలో చైర్మన్ శపథంరెడ్డి, వైస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ కృష్ణారెడ్డి, నాయకులు మురళీధర్ గౌడ్, జంబిగే హన్మాండ్లు, డైరెక్టర్లు, కార్యదర్శి సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం అందజేత

ఆర్థిక సహాయం అందిస్తున్న మత్స్యకార్మిక సంఘం సభ్యులు

లింగంపేట, ఏప్రిల్ 5: మండలంలోని పోల్కంపేట గ్రామానికి చెందిన కోర్పోత్ నవీన్ కుటుంబానికి మత్స్యకార్మిక సంఘం సభ్యులు ఆర్థిక సాయం చేశారు. వారం రోజుల క్రితం నవీన్ గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న తోటి కార్మికులు కుటుంబాన్ని పరామర్శించి ఐదువేల రూపాయలు అందజేశారు. కుటుంబాన్ని పరామర్శించిన వారిలో రాజు, వెంకటేశం, శ్రీనివాస్, మహేశ్, పిట్ల వెంకటేశ్, సిద్ధయ్య తదితరులు ఉన్నారు.

బిచ్కుంద అంగట్లో అన్నీ సమస్యలే

- ఆదాయం సమకూరుతున్నా పట్టించుకోని అధికారులు
- తాగునీటికీ తప్పని తిప్పలు
- కరువైన మౌలిక సదుపాయాలు

బిచ్కుంద మండల కేంద్రంలో కొనసాగుతున్న వారాంతపు సంత

బిచ్కుంద, ఏప్రిల్ 5 : జుక్కల్ నియోజకవర్గంలో అతి పెద్ద అంగడి ఏదంటే బిచ్కుంద మండల కేంద్రంలో జరిగే వారాంతపు సంత అని చెప్పాలి. పేదోడికి షాపింగ్‌మాల్‌గా భావించే అంగట్లో అన్నీ సమస్యలే దర్శనమిస్తున్నాయి. మండల కేంద్రంలో ప్రతి బుధవారం జరిగే వారాంతపు సంతకు మండల కేంద్రంతోపాటు మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల సరిహద్దు గ్రామాల రైతులు కూరగాయలు, పప్పుదినుసులు పండించి సంతకు తీసుకువస్తారు. ఉదయం10గంటల నుంచి రాత్రి 8గంటల వరకు నిర్వహించే సంతలో దొరకని వస్తువు అంటూ ఉండదు. అటు రైతులకు ఇటు ప్రజలకు అవసరమయ్యే వస్తువులు, పనిముట్లు లభిస్తుండడంతో వివిధ ప్రాంతాలనుంచి వ్యాపారులు, కొనుగోలుదారులు భారీగా తరలి వస్తుంటారు. పండుగలు, శుభకార్యాలకు కావాల్సిన వస్తువులు, వ్యవసాయ పరికరాలు, నిత్యావసర వస్తువులు, రైతులు పండించిన పప్పుదినుసులు, కూరగాయలు అన్నీ ఒకే చోట లభిస్తాయి. అలాంటి సంత నేడు సమస్యలతో సతమతమవుతున్నది. ప్రతి ఏడాది తైబజార్ వేలం ద్వారా గ్రామ పంచాయతీకి లక్షల రూపాయల ఆదాయం సమకూరుతున్నా మౌలిక వసతులు సమకూర్చడంలో అధికారులు విఫలమవుతున్నారు. వారాంతపు సంతకు ప్రత్యేక స్థలం లేకపోవడంతో గాంధీచౌక్ నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు ఉన్న ప్రధాన రహదారిపైనే వ్యాపారులు వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. ప్రధాన రహదారిపై కొనసాగడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఫలితంగా సంతకు వచ్చే చుట్టుపక్కల గ్రామాల ప్రజలతో పాటు స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ దవాఖాన, పోలీస్ స్టేషన్‌కు వెళ్లాలన్నా ఈదారి గుండా వెళ్లాల్సిందే. వేసవి కాలం ప్రారంభమవడంతో కనీసం సంతకు వచ్చే జనాలకు అవసరమైన తాగునీటి వసతి కూడా ఏర్పాటు చేయక పోవడంతో తాగునీటిని కొనుక్కొని తాగాల్సిన దుస్థితి నెలకొన్నది. మూత్రశాలలు, మరుగుదొడ్లు లేకపోవడంతో కాలకృత్యాలు తీర్చుకోవడానికి అంగడికి వచ్చే జనంతో పాటు వ్యాపారులు, కొనుగోలుదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి అంగట్లో అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

తాగునీటి సౌకర్యం కల్పించాలి..

నాది వాజిద్‌నగర్ గ్రామం. నేను మా పొలంలో ఆకుకూరలు పండించి బిచ్కుంద అంగడికి తీసుకచ్చి అమ్ముతా. అంగట్లో తాగటానికి నీటి సౌకర్యం లేదు. బాగా ఇబ్బందులకు గురవుతున్నాం. అధికారులు స్పందించి తాగునీటి సౌకర్యం కల్పించాలి.

-సాయికుమార్, వ్యాపారి, వాజిద్‌నగర్ గ్రామం

పబ్లిక్ టాయిలెట్లు నిర్మించాలి..

నాది బాన్సువాడ పట్టణం. నేను 20 ఏండ్లనుంచి కరివేపాకు, కొత్తిమీర వ్యాపారం చేస్తున్నాను. బిచ్కుంద అంగడిలో ఒకటికి, రెండింటికి వెళుదామన్నా ఇక్కడి నుంచి బస్టాండ్‌కో లేదా ఊరిబయటికో పోవాలి. అలాగే తాగడానికి నీటి సౌకర్యం కూడా లేదు. గ్రామ పంచాయతీ అధికారులు స్పందించి తాగు నీటి సౌకర్యంతో పాటు పబ్లిక్ టాయిలెట్లు నిర్మించాలి.

-ఖాజా, వ్యాపారి, బాన్సువాడ

సీసీ రోడ్డు పనులు నాణ్యతగా చేపట్టాలి

మీసన్‌పల్లిలో కొనసాగుతున్న సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో ప్రకాశ్

ఎల్లారెడ్డి రూరల్, ఏప్రిల్ 5: సీసీ రోడ్డు పనులు నాణ్యతగా చేపట్టాలని ఎంపీడీవో ప్రకాశ్ సూచించారు. మండలంలోని మీసన్‌పల్లి గ్రామంలో ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నిధుల ద్వారా చేపట్టిన సీసీ రోడ్డు పనులను ఆయన శనివారం పరిశీలించారు. సకాలంలో రోడ్డు పనులను పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ఆయన వెంట గ్రామ కార్యదర్శి, సిబ్బంది ఉన్నారు.

ఉద్యోగ సంఘ కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక

లింగంపేట, ఏప్రిల్ 5: జిల్లా నాయక్‌పోడ్ ఉద్యోగ సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. లింగంపేట మండల కేంద్రంలోని ఎల్లమ్మ ఆలయంలో ఉద్యోగ సంఘం సభ్యులు శనివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సంఘం అధ్యక్షుడిగా తడగారి సాయిలు, ఉపాధ్యక్షుడిగా ముత్యాల అశోక్, ప్రధాన కార్యదర్శిగా అన్నారం విఠల్, సహాయ కార్యదర్శిగా దయానంద్, కోశాధికారిగా బాలయ్య, మహిళా కార్యదర్శిగా మెట్టు సరస్వతి, సలహాదారులుగా రామ్‌గోపాల్, సంజీవులు, వెంకట్, మహిపాల్, లింగం, అనిల్‌ను ఎన్నుకున్నారు.

సమావేశంలో పాల్గొన్న ఆదివాసీ నాయక్‌పోడ్ ఉద్యోగ సంఘం సభ్యులు

భార్యను కొట్టిన భర్తపై కేసు నమోదు

ఎల్లారెడ్డిరూరల్, ఏప్రిల్ 5: కుటుంబ కలహాల్లో భాగంగా భార్యను కట్టితో కొట్టి గాయపరిచిన భర్తపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై బొజ్జ మహేశ్ తెలిపారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని సోమార్‌పేట్ గ్రామానికి చెందిన రామగల్ల లావణ్యకు ఏడేండ్ల క్రితం శేఖర్‌తో వివాహం జరిగింది. కొన్ని రోజులుగా శేఖర్ మద్యానికి బానిసై ఇంటిని, పిల్లలను పట్టించుకోకుండా భార్య లావణ్యను వేధిస్తున్నాడు. భర్త పెడుతున్న బాధలను తట్టుకోలేక శేఖర్ మామ శివానంద్‌కు చెప్పుకొని బాధపడింది. ఈనెల 4న ఎల్లారెడ్డి గాంధీచౌక్ వద్ద లావణ్య, శివానంద్ ఇద్దరూ కలిసి శేఖర్‌తో మాట్లాడుతూ, సర్దిచెబుతూ ఉండగా వినకుండా శేఖర్ లావణ్యను కట్టితో కొట్టి గాయపరిచాడు. లావణ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

యువతి అదృశ్యం

మధుమతి

ఎల్లారెడ్డి రూరల్, ఏప్రిల్ 5: తల్లిగారి ఇంటి వద్ద ఉన్న వివాహిత అదృశ్యమైన ఘటన అల్మాజీపూర్ గ్రామంలో చోటుచేసుకున్నది. ఎల్లారెడ్డి ఎస్సై బొజ్జ మహేశ్ తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని అల్మాజీపూర్ గ్రామానికి చెందిన ఎరుకల మధుమతికి ఏడాదిక్రితం జంగమాయిపల్లి గ్రామానికి చెందిన మహేందర్‌తో వివాహమైంది. వారిరువురి మధ్య జరుగుతున్న గొడవల కారణంగా నాలుగు నెలల నుంచి మధుమతి తన అమ్మగారి ఇంట్లో ఉంటున్నది. ఈనెల 4న మధుమతి తన తల్లి సుగుణ, తమ్ముడు కలిసి తిని పడుకున్నారు. డ్యూటీకి వెళ్లిన తండ్రి పోచయ్య రాత్రి 12 గంటలకు ఇంటికి వచ్చి చూడగా కూతురు కనిపించలేదు. చుట్టుపక్కల, తెలిసిన వారి వద్ద వెతుకగా ఆచూకీ లభించలేదు. తండ్రి పోచయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

లైంగికదాడి కేసు నమోదు

రామారెడ్డి, ఏప్రిల్ 5 : మండలంలోని ఒక గ్రామానికి చెందిన ఓ మహిళ తనపై నలుగురు వ్యక్తులు అత్యాచారం చేశారని శుక్రవారం రామారెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై నరేశ్ తెలిపారు. పూర్తిస్థాయిలో విచారణ చేస్తున్నామని, త్వరలో వివరాలు వెల్లడిస్తామని పేర్కొన్నారు.

లోన్‌యాప్ ఏజెంట్ల వేధింపులు భరించలేక యువకుడి ఆత్మహత్య

సందీప్(ఫైల్)

రామారెడ్డి(సదాశివనగర్), ఏప్రిల్ 5 : లోన్‌యాప్ ఏంజెట్ల వేధింపులు భరించలేక ఒక యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన రెండురోజుల క్రితం చోటు చేసుకున్నది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. సదాశివనగర్ మండల కేంద్రానికి చెందిన నిమ్మలబోయిన సందీప్ (29) కొంతకాలంగా హైదరాబాద్‌లోని అల్వాల్‌లో నివాసముం టూ సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. సందీప్ లోన్‌యాప్‌లో అప్పులు తీసుకొని స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడి పెట్టాడు. వరుసగా నష్టాలు రావడంతో తీవ్ర మనస్తాపం చెందిన సందీప్.. ఇంట్లో రెండు రోజుల క్రితం ఉరేసుకొని మృతి చెందాడు. అంత్యక్రియలు శుక్రవారం సదాశివనగర్‌లో జరిగాయి. అల్వాల్‌లో ఏజెంట్లు పలుమార్లు ఇంటికి వెళ్లి ఇంటి ముందు కూర్చోవడంతో తీవ్ర మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకున్నాడని కుటుంబ సభ్యులు తెలిపారు. ఇంటికి పెద్ద దిక్కును కోల్పాయామని, తండ్రి మానసిక స్థితి బాగాలేదని.. లోన్‌యాప్ ఏజెంట్లు, సంస్థలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కోరారు. సందీప్‌కు ఐదు నెలల క్రితం వివాహమైందని తెలిపారు.